సాక్షి
పశ్చిమగోదావరి

ఆదివారం । 6 । ఆగస్టు । 2023



శ్రీనివాసా.. గోవిందా..

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రం భక్తజన సంద్రమైంది. వేకువజాము నుంచి భక్తుల రాక మొదలైంది. క్షేత్రంలోని అన్ని విభాగాలు భక్తులతో కిక్కిరిశాయి.



నేత్రపర్వం.. డోలోత్సవం

కాళ్ల: కాళ్లకూరు వేంకటేశ్వరస్వామి ఆలయంలో సహస్ర దీపాలంకరణ సేవ, అష్టోత్తర శతనామార్చన, ఊంజల్ సేవలు (డోలోత్సవం) ఘనంగా జరిగాయి.



గిరిజనాభివృద్ధికి కృషి

ఏలూరు(మెట్రో): ఐటీడీఏ పీఓ ఎం.సూర్యతేజ ఏలూరు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, జేసీ లావణ్య వేణిని కలిశారు. గిరిజనాభివృద్ధికి కృషి చేయాలని కలెక్టర్ ఆయనకు సూచించారు.

న్యూస్‌రీల్

హెలీప్యాడ్‌కు స్థల పరిశీలన



అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ

కుక్కునూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం మండలంలోని గొమ్ముగూడెం వరద ప్రభావిత గ్రామంలో పర్యటించే అవకాశం ఉందన్న ముందస్తు సమాచారంతో అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. శనివారం జంగారెడ్డిగూడెం ఆర్డీఓ ఝాన్సీ రాణి, సీఐ సత్యనారాయణ, కుక్కునూరు, వేలేరుపాడు తహసీల్దార్లు డీఎల్ ప్రమద్వర, చల్లన్నదొర హెలికాప్టర్ ల్యాండింగ్ కోసం హెలీప్యాడ్ స్థలాన్ని పరిశీలించారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కుచ్చర్లపాటి నరసింహరాజు, రావు వినోద్ ఉన్నారు.

సైన్స్‌పై అవగాహన తప్పనిసరి



మాట్లాడుతున్న సర్వేశ్వరశర్మ

పాలకొల్లు సెంట్రల్: ప్రతి విద్యార్థి సైన్స్‌పై మక్కువ చూపుతూ అవగాహన పెంచుకోవాలని డాక్టర్ సీవీ సర్వేశ్వర శర్మ అన్నారు. శనివారం స్థానిక ఆదిత్య స్కూల్‌లో జరిగిన సైన్స్ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన సైన్స్‌పై విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగారు. సైన్స్ ఉపయోగాలు వివరించారు. ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్ ఎస్‌వీ రాఘవరెడ్డి మాట్లాడుతూ సైన్స్ చక్రవర్తిగా పేర్గాంచిన సీవీ సర్వేశ్వరశర్మ తమ స్కూల్‌కు రావడం శుభపరిణామమన్నారు. ఎమ్మెస్సీ, పీహెచ్‌డీలో గోల్డ్ మెడల్ సాధించిన శర్మ 1984 లో కోనసీమ సైన్స్‌పరిషత్ స్థాపించారన్నారు. 81 ఏళ్ల వయసులోనూ సైన్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించడం అభినందనీయమన్నారు. ప్రిన్సిపాల్ ఎస్.అయ్యపరాజు పాల్గొన్నారు.

ఆలయ ఉద్యోగిపై కేసు నమోదు



రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

ద్వారకాతిరుమల: చినవెంకన్న కట్నకానుకల సొమ్ము స్వాహా చేసిన ఆలయ ఉద్యోగిపై పోలీస్‌స్టేషన్‌లో శనివారం కేసు నమోదైంది. వివరాలిలా ఉన్నాయి.. చినవెంకన్న ఆలయ జూనియర్ అసిస్టెంట్ కె.హరిశ్చంద్రప్రసాద్ గతేడాది జూలై నుంచి ఈ ఏడాది జూన్ వరకు నిత్య కల్యాణ మండపంలో విధులు నిర్వర్తించాడు. ఆ సమయంలో స్వామి, అమ్మవార్లకు కట్న కానుకలను సమర్పించిన భక్తులకు రసీదులు ఇచ్చాడు. అయితే రసీదుల్లో రాసిన నగదు పూర్తిగా దేవస్థానానికి జమకాకపోవడాన్ని ఇటీవల అధికారులు గుర్తించి విచారణ జరిపారు. రసీదులో రాసిన నగదు కంటే, తక్కువ మొత్తాన్ని లెడ్జర్ బుక్‌లో నమోదు చేసి రూ.95,734 సొమ్మును స్వాహా చేయడంతో పాటు రికార్డుల ట్యాంపరింగ్‌కు సైతం పాల్పడినట్టు నిర్ధారించారు. దీనిపై ఆలయ ఏఈఓ పి.నటరాజారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై టి.సుధీర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దీనిలో భాగంగా నిత్య కల్యాణ మండప ప్రాంతాన్ని పరిశీలించి, ఆలయ కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేశారు. ఏఈఓ నటరాజు నుంచి వివరాలను సేకరించారు.

ట్రిపుల్‌ఐటీ ప్రవేశాలకు రెండో జాబితా విడుదల

నూజివీడు: ఆర్జీయూకేటీ పరిధిలోని నాలుగు ట్రిపుల్‌ఐటీల్లో మొదటి విడత కౌన్సెలింగ్ అనంతరం మిగిలిన 765 సీట్ల భర్తీకి గాను రెండో విడత అభ్యర్థుల ఎంపిక జాబితాను యూనివర్సిటీ అధికారులు శుక్రవారం ఆర్జీయూకేటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. వీరంతా ఈనెల 9,10 తేదీల్లో నూజివీడు ట్రిపుల్‌ఐటీలో నిర్వహించే కౌన్సెలింగ్‌కు హాజరవ్వాల్సి ఉంటుంది. ఎంపికైన విద్యార్థులందరికి ఎస్ఎంఎస్, మెయిల్స్ ద్వారా సమాచారం అందించారు.

నకిలీ సిగరెట్లపై విజి‘లెన్స్’

పొగరాయుళ్లకు సెగ

- బ్రాండెడ్ సిగరెట్లను పోలి ప్యాకింగ్
- అనధికార విక్రయాలతో పన్ను ఎగవేత
- ఫుడ్ పార్సిళ్ల పేరుతో ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి
- ఉమ్మడి గోదావరి జిల్లాల్లో విజిలెన్స్ దాడులు
- రూ.15 లక్షల విలువైన సిగరెట్లు సీజ్



తాడేపల్లిగూడెంలో నకిలీ సిగరెట్ల నిల్వలను సీజ్ చేసిన విజిలెన్స్ ఎస్పీ కరణంకుమార్, అధికారులు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, ఏలూరు: గోదావరి జిల్లాలో నకిలీ సిగరెట్లు భారీగా చలామణి అవుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం అనుమతించిన ప్రధాన బ్రాండ్ల సిగరెట్లను పోలిన రీతిలో ప్యాకింగ్‌తో నకిలీ సిగరెట్లు మార్కెట్‌లోకి వస్తున్నాయి. అమలాపురం నుంచి తాడేపల్లిగూడెం వరకు అన్ని ప్రధాన ప్రాంతాల్లో పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చాయి. అతి తక్కువ ధరకు దొరకడం, ప్రధాన బ్రాండ్లను పోలిన రీతిలో ఉండటంతో పల్లెల్లోనూ జోరుగా విక్రయాలు జరుగుతున్నాయి. వీటిపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. గత 15 రోజుల్లో సుమారు రూ.15 లక్షల విలువైన సిగరెట్ల నిల్వలను సీజ్ చేసి కేసులు నమోదు చేశారు. ముఖ్యంగా గత మూడు రోజుల్లో రూ.11 లక్షల విలువైన నకిలీ సిగరెట్లను గుర్తించారు. హైదరాబాద్, ఇతర ప్రాంతాల నుంచి ఫుడ్ పార్సిళ్ల పేరుతో రవాణా వాహనాల్లో తాడేపల్లిగూడెం, రాజమండ్రికి నకిలీ సిగరెట్లు దిగుమతి అవుతున్నాయి. అక్కడ నుంచి ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాలోని పలు ప్రాంతాలకు సరఫరా అవుతున్నాయి.

హోల్‌సేల్ డీలర్ల ద్వారానే..

సీఓటీపీఏ చట్టప్రకారం కేంద్ర ప్రభుత్వం అనుమతించిన సిగరెట్ బ్రాండ్లను మాత్రమే మార్కెట్‌లో విక్రయించాలి. పొగాకు ఉత్పత్తుల విక్రయాలపై 28 శాతం సెంట్రల్ జీఎస్టీ ఉంటుంది. సిగరెట్లలో దాదాపు 85 శాతం బ్రాండ్లు ఐటీసీ కంపెనీవి కాగా అనుమతి ఉన్న బ్రాండ్లు మరికొన్ని ఉన్నాయి. అయితే ఇప్పుడు కొత్తగా హైదరాబాద్, ఇతర రాష్ట్రాల నుంచి నకిలీ సిగరెట్లు దిగుమతి అవుతున్నాయి. రాజమండ్రి, అమలాపురం, తాడేపల్లిగూడెం, కాకినాడ మార్కెట్‌లో భారీగా చలామణి అవుతున్నాయి. ఆయా ప్రాంతాల్లో సిగరెట్ హోల్‌సేల్ డీలర్లతో మాట్లాడుకుని నకిలీ సిగరెట్లు కూడా వారి ద్వారానే షాపులకు సరఫరా చేస్తున్నారు. గోల్డ్‌ఫ్లాక్ ఫిల్టర్‌ను పోలిన గోల్డ్ స్టాగ్, గోల్డ్ ఫ్లాక్ కింగ్ పోలిన గోల్డ్ విమల్, ఫరేవర్ గోల్డ్, హార్బర్ గోల్డ్, ఏ10, వైట్‌ఫ్లాక్, గోల్డ్‌విమల్ మింట్ పేర్లతో ఎలాంటి పన్ను చెల్లించకుండా సిగరెట్లను భారీగా విక్రయిస్తున్నారు. అలాగే ఓరియో బిస్కెట్ ప్యాకెట్లను పోలిన ప్యాకింగ్‌తో ఓరీస్ పేరుతో సిగరెట్లను చలామణి చేస్తున్నారు. గత నెలలో విజిలెన్స్ అధికారులు కాకినాడలో మొదట దాడి చేసి కేసు నమోదు చేశారు. అక్కడ నుంచి తీగ లాగితే తాడేపల్లిగూడెం వరకు డొంక కదిలింది.

వ్యాపారులకు ఆశచూపి

సిగరెట్ ప్యాకెట్లపై ఎమ్మార్పీ రూ.50 ఉంటే రూ.20, రూ.30కే హోల్‌సేల్ వ్యాపారులకు ఇస్తున్నారు. అధిక లాభాల ఆశతో నకిలీవి అయినా వ్యాపారులు పెద్ద ఎత్తున కొనుగోలు చేసి మార్కెట్‌లోకి పంపుతున్నారు. పూర్తిస్థాయిలో నాసిరకం పొగాకుతో కేంద్ర ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా తయారు చేసి విక్రయిస్తుండటంతో విజిలెన్స్ అధికారులు సోదాలు చేస్తున్నారు. షాపుల నిర్వాహకులపై కేసులు నమోదు చేసి పోలీసులకు అప్పగిస్తున్నారు. వ్యాపారులు ప్రతి విక్రయంపై 28 శాతం రావాల్సిన జీఎస్టీ ఆదాయానికి నకిలీలతో గండి కొడుతున్నారు.

కేసులు ఇలా..

- గతనెల 21న కాకినాడలోని సూర్యనారాయణపురంలో తిరుమల జనరల్ స్టోర్స్‌లో ఆరు ప్రధాన బ్రాండ్లకు చెందిన 7,135 సిగరెట్ ప్యాకెట్లను అధికారులు గుర్తించారు. వాటిపై ఉన్న ఎమ్మార్పీ ప్రకారం రూ.3,56,700గా ధర నిర్ధారించి కేసు నమోదు చేశారు.
- ఈనెల 2న తాడేపల్లిగూడెంలోని సీతారామపేటలో లక్ష్మీరమణ జనరల్ స్టోర్స్‌లో సోదాలు చేసి 8,075 నిషేధిత సిగరెట్ ప్యాకెట్లను గుర్తించారు. వీటి విలువ రూ.4,03,750గా నిర్ధారించారు.
- తాడేపల్లిగూడెంలోని కోలావారి వీధిలో పురుషోత్తమ వాసవీ జనరల్ స్టోర్స్‌లో రూ.56,300 విలువైన 1,110 నిషేధిత సిగరెట్ ప్యాకెట్లను గుర్తించి సీజ్ చేశారు.
- ఈనెల 3న రాజమండ్రిలోని మేఘన ఎంటర్‌ప్రైజెస్, సత్యమణికంఠ జనరల్ స్టోర్స్, శ్రియ జనరల్ స్టోర్స్‌లో రూ.5,91,600 విలువైన సిగరెట్లను సీజ్ చేశారు.

25,383 ఇళ్ల నిర్మాణాలు పూర్తి

కలెక్టర్ ప్రశాంతి



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లాలో 25,383 ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేశామని, మిగిలిన ఇళ్లు కూడా త్వరితగతిన పూర్తి చేయడానికి చర్యలు చేపట్టామని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. శనివారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్ రెడ్డి విజయవాడ నుంచి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు అంశాలపై సమీక్షించారు. భీమవరం కలెక్టరేట్ నుంచి కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 72,059 ఇళ్ల నిర్మాణాలు లక్ష్యం కాగా 25,383 నిర్మాణాలు పూర్తయ్యాయన్నారు. బీఎల్ తదుపరి స్టేజ్ కన్వర్షన్‌లో 37,254 ఇళ్లు ఉన్నాయన్నారు. గృహనిర్మాణాలు పూర్తయిన చోట సోప్ పిట్స్ నిర్మాణాల పూర్తికి చర్యలు తీసుకుంటామన్నారు.

4,844 అర్జీల పరిష్కారం : జగనన్నకు చెబుదాంకు సంబంధించి 6,346 అర్జీల్లో 4,844 పరిష్కరించామని, 1,041 అర్జీలు పరిష్కార దశలో ఉండగా 437 రీ ఓపెన్ అయ్యాయన్నారు. ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం కింద క్రీడాపోటీల పోటీల నిర్వహణకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్టు చెప్పారు. 131 గ్రామాలకుగాను 31 గ్రామాల్లో ఫేజ్–2 రీసర్వే పూర్తిచేశామని, మిగిలిన గ్రామాల్లో త్వరితగతిన పూర్తిచేయాలని తహసీల్దార్లకు ఆదేశాలు ఇచ్చామని కలెక్టర్ అన్నారు. జేసీ ఎస్.రామసుందర్‌రెడ్డి పాల్గొన్నారు.

త్వరితగతిన కేసులు విచారించాలి



జ్యుడీషియల్ ఆఫీసర్స్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జస్టిస్ రఘునందనరావు

ఏలూరు(మెట్రో): విధి నిర్వహణలో న్యాయమూర్తుల ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జడ్జి, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ రావు రఘునందనరావు అన్నారు. శనివారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని న్యాయమూర్తులతో ఏలూరు కలెక్టరేట్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్ కేసులను త్వరితగతిన విచారించాలని న్యాయమూర్తులకు సూచించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి పురుషోత్తం కుమార్ మాట్లాడుతూ న్యాయమూర్తులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని జస్టిస్ రఘునందనరావు పేర్కొన్నారని అన్నారు. కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా జడ్జి జి.రామగోపాల్‌తో పాటు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని న్యాయమూర్తులు పాల్గొన్నారు.

వరద బాధితులకు బాసట



వేలేరుపాడులో ఆర్థిక సాయం అందిస్తున్న వైఎస్సార్ సీపీ కన్వీనర్ శ్రీనివాసగౌడ్

వేలేరుపాడు: మండలంలోని వేలేరుపాడు సంతబజారు, మసీదుకాలనీ, చాకలిబజారు, నడిమిగొమ్ము తదితర గ్రామాల్లో వరద బాధితులకు రూ.2 వేల పరిహారాన్ని శనివారం వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కేసగాని శ్రీనివాసగౌడ్ అందజేశారు. రేపాకగొమ్ము గ్రామ పంచాయతీ పరిధిలో 600 మంది బాధితులకు పరిహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నడూలేని విధంగా సీఎం జగన్ బాధితులను అన్నివిధాలా ఆదుకుంటున్నారన్నారు. ఇళ్లు మునిగిన కుటుంబాలకు రూ.10 వేలు ప్రకటించడం హర్షణీయమన్నారు. అలాగే ప్రతి కుటుంబానికి 25 కిలోల బియ్యం, కిలో కందిపప్పు, లీటరు వంటనూనె, కూరగాయలు అందించారన్నారు. వైస్ ఎంపీపీ వెంకటేశ్వరమ్మ, సర్పంచ్ సోడే వెంకమ్మ, ఎంపీపీ కె.లక్ష్మీదేవి, జెడ్పీటీసీ సభ్యురాలు గుజ్జా రామలక్ష్మి, కప్పా వెంకటేశ్వర్లు, కురిమెళ్ల రమేష్, చక్రి పాల్గొన్నారు.

జెడ్పీటీసీల సూచనలకు ప్రాధాన్యం

జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ



జెడ్పీ సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ, కలెక్టర్లు ప్రసన్న వెంకటేష్, ప్రశాంతి

ఏలూరు(మెట్రో): జిల్లాపరిషత్ నిధులతో మండల పరిధిలో చేపట్టే పనుల్లో జెడ్పీటీసీ సభ్యుల సూచనలకు ప్రాధాన్యమిస్తామని జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. స్థానిక జెడ్పీ కార్యాలయంలో శనివారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాపరిషత్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. పలువురు జెడ్పీటీసీలు సమస్యలను సభ దృష్టికి తీసుకురాగా వాటి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. జల్‌జీవన్ మిషన్ ద్వారా ప్రతిఇంటికీ తాగునీరు అందిస్తున్నామన్నారు. ఇళ్ల నిర్మాణాల్లో జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపేలా అధికారులు కృషి చేయాలన్నారు. అంటువ్యాధుల నివారణ, పారిశుద్ధ్య పరిస్థితులు, దోమల నిర్మూలనపై సూచనలు ఇచ్చారు. వరదలతో దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు.

నాణ్యత పరిశీలనకు బృందాలు

ఏలూరు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ సర్కారీ బడుల్లో నాడు–నేడు కింద చేపట్టిన నిర్మాణ పనుల నాణ్యతా పరిశీలనకు ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేశామన్నారు. కొల్లేరు కాంటూర్ పరిధిలో లైడాల్ విధానం ద్వారా భూములను రీ సర్వే చేస్తామన్నారు. పోలవరం ప్రాజెక్ట్ నిర్వాసితుల కాలనీల్లో విద్యా, వైద్యం, మౌలిక వసతులు పూర్తిస్థాయిలో కల్పిస్తామన్నారు. శాసనమండలి సభ్యుడు ఇళ్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పంచాయతీరాజ్‌లో సుమారు 400 మంది అటెండర్లు, స్వీపర్లు, ట్యాంక్ వాచ్‌మన్ తదితర ఉద్యోగులకు పీఆర్‌సీ బకాయిలు చెల్లించాలని కోరారు. సమావేశంలో పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ ప్రశాంతి, తూర్పుగోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్ నంబూరి తేజ్‌భరత్, ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు, జెడ్పీ సీఈఓ కె.రవికుమార్, డీపీఓ తూతిక విశ్వనాథ్ శ్రీనివాస్, ఉమ్మడి జిల్లా అధికారులు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు పాల్గొన్నారు.

గౌరవ వేతనం పెంచాలి



శాసనమండలి సభ్యుడు వంక రవీంద్రనాథ్ మాట్లాడుతూ ఎంపీటీసీలకు గౌరవ వేతనం పెంచాలని, తణుకు మండలం దువ్వలో పీహెచ్‌సీ ఏర్పాటు చేయాలని, తణుకు, పెరవలి మండలాల్లో విద్యుత్ సబ్‌స్టేషన్లు నిర్మించాలని కోరారు. పెరవలి మండలం మల్లేశ్వరంలో సబ్‌స్టేషన్ ఏర్పాటుకు దాతలు స్థలం అందించారన్నారు.

వరద సాయం భేష్



ఆచంట ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు మాట్లాడుతూ వరదల వల్ల ప్రాణ, ఆస్తి నష్టాలు లేకుండా ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల కలెక్టర్లు ముందు జాగ్రత్తలు తీసుకున్నారని, బాధితులకు అండగా నిలుస్తూ సహాయక చర్యలు చేపట్టారన్నారు. జిల్లాపరిషత్ ద్వారా అన్ని మండలాలకు సమానంగా నిధులు కేటాయించాలని కోరారు.

‘నవోదయ’ విద్యార్థులంతా క్షేమం



ఏలూరులో విద్యార్థులను పరామర్శిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ, ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి, కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్, ఎస్పీ మేరీ ప్రశాంతి

ఏలూరు టౌన్: పెదవేగి నవోదయ విద్యాలయంలో అస్వస్థతకు గురై ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులంతా క్షేమంగా ఉన్నారు. శనివారం జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్, జిల్లా ఎస్పీ డి.మేరీ ప్రశాంతి విద్యార్థులను పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఆస్పత్రిలో 74 మంది విద్యార్థులు చికిత్స పొందుతుండగా వారిలో ముగ్గురు మాత్రమే డయేరియాతో బాధపడుతున్నారన్నారు. విద్యార్థుల ఆరోగ్యం నిలకడగా ఉందన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులతో ఫోన్‌లో మాట్లాడించామనీ, ఫుడ్ శాంపిల్స్‌ను అధికారులు టెస్టులకు పంపారనీ, రిపోర్టులు పరిశీలించి చర్యలు తీసుకుంటామని అన్నారు. ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ ఐదు రాష్ట్రాల నుంచి స్పోర్ట్స్ మీట్‌కు 195 మంది విద్యార్థులు రాగా వారిలో 74 మంది విద్యార్థులు అస్వస్థతకు గురి కాగా శుక్రవారం రాత్రి హుటాహుటిన వైద్య సేవలందించామన్నారు. పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో చిత్తశుద్ధి పనిచేస్తోందన్నారు. విద్యార్థులతో పాటు 34 మంది ఎస్కార్ట్స్ వచ్చారనీ వారితోనూ మాట్లాడామన్నారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ ఎం.శశిధర్, చీఫ్ ఫిజీషియన్ పోతునూరి శ్రీనివాసరావు, ఆర్ఎంఓ శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

శశిలో ముగిసిన వర్క్‌షాప్



మాట్లాడుతున్న వైస్‌చైర్మన్ మేకా నరేంద్రకృష్ణ

తాడేపల్లిగూడెం : జియో సింథటిక్ అనేది సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులకు అతిముఖ్యమైన టెక్నాలజీ అని జేఎన్‌టీయూ వీసీ ప్రసాదరాజు అన్నారు. జియో సింథటిక్ ఫర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సస్టైనబిలిటీ అనే అంశంపై శశి ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటుచేసిన రెండు రోజుల వర్క్‌షాప్ శనివారం ముగిసింది. ఆర్‌అండ్‌బీ ఇంజనీర్ ఇన్ చీఫ్ కె.నయిముల్లా జియోసింథటిక్ ప్రాముఖ్యతను వివరించారు. విద్యాసంస్థ చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ, వైస్ చైర్మన్ మేకా నరేంద్రకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

వర్సిటీపై ఆరోపణలు తగవు

తాడేపల్లిగూడెం : డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న ప్రధాన శాస్త్రవేత్త కె.ధనుంజయరావు బదిలీపై కుల సంఘాలు చేస్తున్న ఆరోపణలను రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో ఖండించారు. పరిపాలనాపరమైన కారణాలతో శాస్త్రవేత్తను బదిలీ చేస్తే దళిత హక్కుల పోరాట సమితి, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం, కుల నిర్మూలన పోరాట సమితి సంఘాలు కారణాలు తెలుసుకోకుండా వర్సిటీ ప్రతిష్టను దిగజార్చేలా మాట్లాడటం సహేతుకం కాదన్నారు. ధనుంజయరావు ఎస్సీ కేటగిరీకి చెందినంత మాత్రాన కులవివక్షతో బదిలీ చేశారనడం సరికాదన్నారు. పరిశోధనా, బోధనా అవసరాలకు లోబడి మాత్రమే నిర్ణయాలు ఉంటాయని, వేరే ప్రాధాన్యతలు ఉండవన్నారు. మార్గదర్శకాల ప్రకారమే బదిలీలు జరుగుతాయన్నారు.

151 గ్రామాలకు 'సత్యసాయి' తాగునీరు

జెడ్పీ స్థాయి సంఘాల సమావేశంలో జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ వెల్లడి



ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జెడ్పీ స్థాయి సంఘాల సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

ఏలూరు(మెట్రో) : జెడ్పీ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టిన రెండు నెలల్లోనే 151 గ్రామాలకు సత్యసాయి తాగునీరు అందించామని జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ వెల్లడించారు. శనివారం ఏలూరు జెడ్పీ కార్యాలయంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రజాపరిషత్ స్థాయి సంఘాల సమావేశం జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ఆధ్వర్యంలో నిర్వహించారు. జెడ్పీటీసీ, అధికారులతో మొత్తం 7 స్థాయి సంఘాలకు సంబంధించిన సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశంలో చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ రూ.ఐదు కోట్లతో 2021లో చేపట్టిన సత్యసాయి తాగునీటి ప్రాజెక్ట్ కింద రెండు నెలల్లో 151 గ్రామాల్లోని 4.52లక్షల మందికి తాగునీరు అందించామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాలకు అందజేస్తున్న అభివృద్ధి పనులలో జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తి చేసేలా అధికారులు కృషి చేయాలని ఆమె కోరారు. ఈ సమావేశంలో ఆర్థిక, ప్రణాళిక, గ్రామీణాభివృద్ధి, విద్యా, వైద్యం, పనులు, పారిశుధ్యం, జాతీయ ఉపాధిహామీ పథకం, వైద్యం, ఆరోగ్యం, హౌసింగ్, విద్యుత్ తదితర అంశాలపై ఇప్పటివరకు జరిగిన పురోగతి, కొత్తగా ప్రతిపాదించిన పనుల వివరాలపై అధికారులతో చర్చించారు. అదే విధంగా రైతులకు అమలు చేస్తున్న పథకాలు, చేపట్టిన పనులు వాటి పురోగతిని సభ్యులకు అధికారులు వివరించారు. అలాగే సాంఘీక సంక్షేమ శాఖ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ, రోడ్లు, భవనాలు, మైన్స్, సివిల్ సప్లయిస్, పంచాయతీరాజ్ చేపట్టిన పురోగతిని, వాటికి సంబంధించి జెడ్పీటీసీలు లేవనెత్తిన సమస్యలపై అధికారులు వివరణ ఇచ్చారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈఓ కె.రవికుమార్, సీపీఓ శ్రీనివాస్, ఇన్‌చార్జి డీఆర్‌ఓ జీవీవీ సత్యనారాయణ, డీఎస్‌ఓ సత్యనారాయణరాజు, సివిల్ సప్లయిస్ డీఎం మంజూభార్గవి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ సత్యనారాయణ, డీపీవో తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్, తదితర ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అధికారులు, జెడ్పీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

వికాస్ విద్యాసంస్థలపై విచారణ

- టీసీలు ఇవ్వడం లేదని స్పందనలో తల్లిదండ్రుల ఫిర్యాదు
- డీఈవో కార్యాలయ ఏడీ షరీఫ్ విచారణ



వికాస్ విద్యాసంస్థలపై ఏడీ షరీఫ్‌కు ఫిర్యాదు చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

జంగారెడ్డిగూడెం : పట్టణంలోని వికాస్ పాఠశాల, కళాశాలపై బాధితులు స్పందనలో ఫిర్యాదు చేయడంతో ఉన్నతాధికారులు విచారణ ప్రారంభించారు. ఈ నేపథ్యంలో శనివారం డీఈవో కార్యాలయం నుంచి ఏడీ షరీఫ్, సీఎంవో రవీంద్ర, సూపరింటెండెంట్ నరసింహారావు ఏలూరు నుంచి వచ్చి స్థానిక ఎంఈవో బి.రాముడు, ఎంఈవో-2 జి.రాములతో కలిసి విచారణ ప్రారంభించారు. స్థానిక వికాస్ విద్యాసంస్థల వివరాలు తెలుసుకున్నారు. అయితే పాఠశాలకు సెలవు ఇవ్వడంతో విద్యార్థులు ఎవరూ లేరని తెలిపారు. అక్కడే ఉన్న ఏవో సురేష్‌ను వివరాలు అడగ్గా కళ్ల కలకలు నేపథ్యంలో విద్యార్థులకు వైరస్ సోకుతుందనే భయంతో పాఠశాలకు సెలవు ఇచ్చినట్లు తెలిపారు. ఇదిలా ఉండగా, ఎంఈవో కార్యాలయానికి విద్యార్థుల తల్లిదండ్రులు, స్పందనలో ఫిర్యాదుచేసిన బాధితులు చేరుకుని ఏడీ షరీఫ్‌కు పలు ఫిర్యాదులు చేశారు. బాధితుడు ఎ.పోలవరానికి చెందిన చింతపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతు ట్రాన్స్‌పోర్ట్ సరిగా లేకపోవడంతో తమ పిల్లలను వేరే స్కూల్‌లో చేర్పించాలని భావించామని, టీసీ కోసం వెళితే రూ. 57 వేలు కట్టాలని చెబుతున్నారన్నారు. తాము స్కూల్ ఫీజు పూర్తిగా కట్టినా టీసీ ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారన్నారు. మరో బాధితుడు జ్ఞానదృష్టి లక్ష్మీ వెంకట నరసింహారావు మాట్లాడుతూ తన కుమారుడు గతేడాది వికాస్ కళాశాలలో ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదివాడని, ఇక్కడ స్టడీ బాగుండకపోవడం, ట్రాన్స్‌పోర్ట్ ఇబ్బంది నేపథ్యంలో సెకండ్ ఇయర్ వేరే కాలేజ్‌లో చేర్పించేందుకు టీసీ కోసం వస్తే రూ. 14500 చెల్లించమంటున్నారని తెలిపారు. తాను ఫీజు మొత్తం రూ.31వేలు కట్టినా ఇంకా డబ్బులు చెల్లిస్తేనే టీసీ ఇస్తామంటున్నారని వాపోయారు. పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని తమ పిల్లలకు టీసీలు ఇప్పించాలని వారు అధికారులను కోరారు. దీనిపై స్పందించిన అధికారులు రేపటి నుంచి టీసీలు ఇప్పించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు. అయితే టీసీలు దగ్గరుండి ఇప్పించాలని బాధితులు అధికారులను కోరారు. దీంతో ఏడీ షరీఫ్ మాట్లాడుతూ పాఠశాలకు, కళాశాలకు వెళ్లి టీసీలు తీసుకోమని సూచించారు. అప్పటికీ ఇబ్బంది పెడితే తమకు ఫిర్యాదు చేయాలని, చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. విచారణలో భాగంగా ఇంకా చాలా మంది బాధితులు ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా, విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని ఏడీ షరీఫ్ విలేకరులకు తెలిపారు.

హత్యకు దారితీసిన వివాహేతర సంబంధం

- ప్రియుడితో కలిసి చాకుతో భర్త మెడపై పొడిచి హత్య
- 24 గంటల్లోనే ఛేదించిన పోలీసులు



ఏలూరు డీఎస్పీ కార్యాలయంలో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు

ఏలూరు టౌన్ : ప్రియుడితో అక్రమ సంబంధానికి భర్త అడ్డుగా ఉన్నాడని.. ఓ వివాహిత నిద్రిస్తున్న భర్తను చాకుతో మెడపై విచక్షణారహితంగా పొడిచి హత్యచేయించింది. ఈ హత్య కేసును పోలీసులు కేవలం 24 గంటలలోపే ఛేదించి నిందితులను అరెస్టు చేసి కటకటాల వెనక్కి నెట్టారు. ఈ మేరకు శనివారం ఏలూరు డీఎస్పీ కార్యాలయంలో ఏలూరు డీఎస్పీ ఈ.శ్రీనివాసులు విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం కోటాల గ్రామానికి చెందిన కురిపాటి చంద్రశేఖర్‌కు 11 ఏళ్ల క్రితం భువనేశ్వరితో వివాహమైంది. వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. వీరు ఉంగుటూరు మండలం నారాయణపురం వైఎస్సార్ కాలనీలో నివాసం ఉంటున్నారు. చంద్రశేఖర్ నారాయణపురం టైల్స్ ఫ్యాక్టరీలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. తాడేపల్లిగూడెం కోతిబొమ్మసెంటర్ ప్రాంతానికి చెందిన గొర్ల సూర్యనారాయణ వీరు నివాసం ఉంటున్న ఇంటిపక్కన తాపీ పని నిమిత్తం వచ్చాడు. భువనేశ్వరికి తాపీ పనిచేస్తున్న గొర్ల సూర్యనారాయణతో పరిచయం ఏర్పడి వివాహేతర సంబంధంగా మారింది. వీరి విషయం భర్త చంద్రశేఖర్‌కు తెలియడంతో తరచూ ఇద్దరి మధ్య గొడవలు జరుగుతూ ఉండేవి. ఈ నేపథ్యంలో భర్త అడ్డు తొలగించుకునేందుకు హత్యకు పథక రచన చేశారు. సూర్యనారాయణ తాడేపల్లిగూడెంలో ఒక చాకును కొనుగోలు చేసి స్కూటీలో పెట్టుకుని, భువనేశ్వరి ఇంటికి వచ్చాడు. ఈనెల 3వ తేదీ రాత్రి చంద్రశేఖర్ ఇంటిలో నిద్రిస్తున్న సమయంలో భువనేశ్వరి, సూర్యనారాయణ చాకుతో దాడి చేశారు. పీక, మెడమీద విచక్షణారహితంగా పొడవటంతో చంద్రశేఖర్ ఘటనా స్థలంలోనే మృతిచెందాడు. ఇంటిలోనే నిద్రిస్తున్న పిల్లలను వదిలేసి భువనేశ్వరి, సూర్యనారాయణ స్కూటీపై పరారయ్యారు. ఈ హత్య కేసును క్రైమ్ నెంబర్ 168/2023 యూ/ఎస్ 302, 449, 120(బీ), రెడ్‌విత్ 34 ఐపీసీగా నమోదు చేశారు. జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి ఆదేశాలతో నిడమర్రు సీఐ ఎంవీ సుభాష్, చేబ్రోలు ఎస్సై కె.స్వామి, నిడమర్రు ఎస్సై ఆర్.శ్రీను దర్యాప్తు చేపట్టారు. నిందితులను 24 గంటల్లోనే అరెస్టు చేసి న్యాయస్థానం ముందు ఉంచారు. హత్య కేసును ఛేదించిన పోలీస్ అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి అభినందించారు.

ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి



హీల్ పాఠశాలకు రూ.1.26 లక్షలను విరాళంగా అందజేస్తున్న హెచ్‌ఎంలు

నూజివీడు : జాతీయ విద్యావిధానంలో వచ్చే మార్పులకు అనుగుణంగా విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని సమగ్ర శిక్షణ డైరెక్టర్ మస్తానయ్య అన్నారు. ఆగిరిపల్లి మండలం తోటపల్లి హీల్ ప్యారడైజ్ పాఠశాల వద్ద ఐదు జిల్లాల(ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు) ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులకు పాఠశాల నాయకత్వంపై ఆరు రోజులపాటు నిర్వహించిన రెసిడెన్షియల్ శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా మస్తానయ్య మాట్లాడుతూ ప్రతి విద్యార్థిని ఉత్తమ పౌరునిగా, బాధ్యత కలిగిన వ్యక్తిగా తీర్చిదిద్దేందుకు ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఏపీ స్కూల్ ఎడ్యుకేషన్ జాయింట్ డైరెక్టర్ బి విజయ భాస్కర్ మాట్లాడుతూ విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐదు జిల్లాల ప్రధానోపాధ్యాయులు హీల్ పాఠశాలకు విరాళంగా రూ.1,26,225 అందచేశారు. చిట్టూరు హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు మోహన్‌రావు మరో రూ.లక్ష, భోగాపురం హైస్కూల్ ప్రధానోపాధ్యాయని శ్రీలక్ష్మి రూ.10 వేలు విరాళంగా అందచేశారు. హీల్ సంస్థ కార్యదర్శి శ్రీమతి తాతినేని లక్ష్మి, ఏలూరు జిల్లా సమగ్ర శిక్ష అకడమిక్ మోనటరింగ్ ఆఫీసర్, భీమడోలు ఎంఈవో-2 భాస్కర్ కుమార్, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల అధికారులు శ్యామ్, సురేష్ వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంక్ ద్వారా రూ.550 కోట్ల లావాదేవీలు



మాట్లాడుతున్న యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఫీల్డ్ జీఎం భాస్కరరావు

నిడదవోలు : పట్టణ పరిసర ప్రాంతాల్లోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖల ద్వారా రూ.550 కోట్ల లావాదేవీలు జరుగుతున్నాయని ఆ బ్యాంక్ ఫీల్డ్ జనరల్ మేనేజర్ సీవీఎస్ భాస్కరరావు పేర్కొన్నారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఖాతాదారుల అవగాహన సదస్సును శనివారం పట్టణంలోని లయన్స్ క్లబ్ ఆడిటోరియంలో శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన భాస్కరరావు మాట్లాడుతూ కిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా వ్యవసాయదారులకు అన్ని రకాల పంట రుణాలను అందిస్తున్నామన్నారు. రైతులకు రూ.1.60 లక్షల వరకూ ఎలాంటి హామీ లేకుండా పంట, టూ వీలర్, త్రీ వీలర్, కారు ఇతర రవాణా వాహనాల రుణాలు ఇస్తున్నామన్నారు. ఆ బ్యాంక్ భీమవరం రీజినల్ హెడ్ వి.సంగీతకుమారి మాట్లాడుతూ బ్యాంక్ నిడదవోలు రైల్వే స్టేషన్ రోడ్ శాఖలో లాకర్ల ఏర్పాటుకు, పాటిమీద సెంటర్లో ఏటీఎం ఏర్పాటుకు కృషి చేస్తున్నామన్నారు. ఖాతాల్లో కనీస నిల్వ రూ.15,000 ఉండే ఖాతాదారులకు బ్యాంకు బీమా సౌకర్యం కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, డీఆర్‌హెచ్‌ఆర్ దివాకర్, ఎన్వీబీ రమణ, ఇందు, బ్యాంక్ నిడదవోలు శాఖల మేనేజర్లు సంతోష్, నవీన్, చాగల్లు బ్రాంచ్ మేనేజర్ రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సొసైటీగా వేల్పూరు పీఏసీఎస్

తణుకు టౌన్ : జిల్లాలో ఉత్తమ సొసైటీగా తణుకు రూరల్ మండలం వేల్పూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘం (పీఏసీఎస్) ఎంపికైంది. ఈమేరకు శనివారం వేల్పూరులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో సొసైటీ అధ్యక్షుడు పెనుమర్తి వెంకట్రామన్న వివరాలు వెల్లడించారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఉత్తమ సేవలందించినందుకుగాను జిల్లాలో వేల్పూరు సొసైటీకి ఉత్తమ సొసైటీగా అవార్డు లభించిందని తెలిపారు. విజయవాడలోని ఏ వన్ కన్వెన్షన్ హాల్‌లో శుక్రవారం జరిగిన ఆప్కాబ్ వజ్రోత్సవ వేడుకలలో రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖా మంత్రి కాకాని గోవర్ధన్ చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు అభినందనలు తెలిపారు.

గంజాయి కేసులో ముగ్గురి అరెస్ట్

సాక్షి, భీమవరం : అక్రమంగా గంజాయి కలిగిఉన్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. భీమవరం టూటౌన్ సీఐ జి.శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం పాలకొల్లు పట్టణానికి చెందిన యర్రంశెట్టి వెంకట నగేష్, ఎ.భాస్కర్ సూర్య, జోగి తనూజ్ కుమార్ భీమవరం మండలం రాయలం గ్రామం వద్ద గంజాయి కలిగివున్నారని సమాచారం అందడంతో పోలీసులు దాడి చేశారు. వారి వద్ద నుంచి 22 కిలోల గంజాయి, రెండు సెల్‌ఫోన్లు, రెండు మోటారుసైకిళ్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీనివాస్ చెప్పారు.

అదనపు కట్నం వేధింపులపై కేసు నమోదు

ఉండి : అదనపు కట్నం వేధింపులపై ఓ మహిళ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం ఉండి మండలం కోలమూరు గ్రామానికి చెందిన నంబూరి సత్యవేణికి 2016లో యలమంచిలి మండలం చించినాడ గ్రామానికి చెందిన రామభద్రిరాజుతో వివాహమైంది. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. వివాహమైన నాటినుంచి అదనపు కట్నం కావాలంటూ భర్త, అత్త మామలు, అడపడుచు, ఆమె భర్త వేధిస్తున్నారు. ఇటీవల వేధింపులు ఎక్కువ కావడంతో ఆమె పుట్టింటికి వచ్చేసింది. శనివారం ఉండి పోలీసులకు ఆమె ఫిర్యాదు చేయడంతో ఎస్సై కె.గంగాధరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు

సాక్షి, భీమవరం : మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు భీమవరం వన్‌టౌన్ ఎస్సై ఎం.వెంకటేశ్వరరావు శనివారం చెప్పారు. వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన నున్నగొప్పుల కనక ఒక షాపులో గుగ్గిలపు ఏసుప్రసాద్ వద్ద కొంతకాలంగా పనిచేస్తోంది. ఆమె ఇటీవల సమీప బంధువు చనిపోవడంతో హైదరాబాద్ వెళ్లింది. అక్కడి నుంచి వచ్చిన తరువాత తనకు మూడు నెలలుగా ఇవ్వాల్సిన జీతం రూ.45 వేలు, గతంలో తన వద్ద తీసుకున్న రూ.75 వేలు తిరిగి ఇవ్వాలని ఏసుప్రసాద్‌ను అడగడంతో శనివారం ఆమె పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి..

మండవల్లి : ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి రూ.లక్షా 20 వేలకు టోకరా వేశాడో వ్యక్తి. వివరాల్లోకి వెళితే మండవల్లి మండలంలోని గురువేళ్లపేట గ్రామానికి చెందిన గురరవేళ్ల కల్యాణ రాంబాబుకు పుట్లచెరువు సబ్‌స్టేషన్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని పుట్లచెరువు గ్రామానికి చెందిన నానుపాత్రుని గోపి నమ్మబలికాడు. ఈమేరకు అతని వద్ద రూ.లక్షా 20 వేలు తీసుకున్నాడు. కాగా ఉద్యోగం ఇప్పించకుండా, తీసుకున్న డబ్బులు అడిగినా ఇవ్వకపోవడంతో మోసపోయానని గుర్తించి బాధితుడు కల్యాణ్‌రాంబాబు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్సై టి.రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

సీజనల్ వ్యాధులపై అవగాహన

తాడేపల్లిగూడెం: సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన ఉండాలని పట్టణ మలేరియాసబ్ యూనిట్ అధికారి వై.వి.లక్ష్మణరావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని యాగర్లపల్లి, ఎన్టీఆర్ జంక్షన్ పరిధిలోని 19,20,26 వ వార్డుల్లో 50 వ విడత ఫీవర్ సర్వే శనివారం నిర్వహించారు. కీటక జనిత ప్రదేశాలను సిబ్బంది గుర్తించాలన్నారు. దోమల ద్వారా వ్యాపించే వ్యాధులు, వాటిని నియంత్రించాల్సిన ప్రాధాన్యతల గురించి ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్యకార్యకర్తలు, వెంకటలక్ష్మి, నాగమల్లి, కనకరత్నం పాల్గొన్నారు.

రేపు తణుకులో ఎన్‌సీఎస్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా

తణుకు టౌన్: నేషనల్ కేరీయర్ సర్వీస్ (ఎన్‌సీఎస్) ఆధ్వర్యంలో ఈనెల 7వ తేదీన తణుకులోని ఎస్‌కెఎస్‌డీ మహిళా కళాశాలలో జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన (ఎంప్లాయిమెంట్ ఆఫీసర్) అధికారి సి మధుభూషణ్ రావు, కళాశాల ప్రిన్సిపాల్ కరుటూరి రామకృష్ణలు తెలిపారు. సోమవా రం తణుకులోని మహిళా కళాశాలలో నిర్వహించే ఈజాబ్‌మేళాను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ
- జగన్నాథపురంలో గడపగడపకు మన ప్రభుత్వం

తాడేపల్లిగూడెం రూరల్: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. శనివారం రాత్రి తాడేపల్లిగూడెం మండలం జగన్నాథపురం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరించారు. అనంతరం డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ షెడ్యూల్‌లో లేని ప్రాంతానికి వెళ్లిన చంద్రబాబును అక్కడి పోలీసులు అడ్డుకోవడంతో అక్కడి వారిని రెచ్చగొట్టి రక్తపాతం సృష్టించారన్నారు. రాష్ట్ర ప్రజలపై చంద్రబాబుకు కక్ష తీరడం లేదన్నారు. అసహనంతో ఏం చేస్తున్నాడో... విజ్ఞతను కోల్పోయి, ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడుతున్నాడన్నారు. వయస్సు పెరిగే కొద్ది హుందాగా మాట్లాడాలన్నారు. ఎంతో సంస్కారవంతమైన కుటుంబం నుంచి వచ్చి పవన్ కళ్యాణ్ చంద్రబాబు కోసం పనిచేస్తున్నాడన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, ఎంపీపీ పానుకుమాటి శేషులత, సర్పంచ్ ఉండ్రాజవరపు చంద్రిక, ఎమ్పీటీసీలు నార్ని రవికాంత నాగేశ్వరరావు (నాగులు), మార్లపూడి సుబ్బారావు, నార్ని శంకరరావు, సొసైటీ చైర్మన్లు వెలిశెట్టి నరేంద్రకుమార్, గుమ్మళ్ళ తాతారావు, తహసీల్దార్ వై.దుర్గా కిషోర్, ఎంపీడీవో ఎం.విశ్వనాథ్, ఎంఈవో వి.హనుమ, మండల వ్యవసాయాధికారి ఆర్ఎస్.ప్రసాద్, ఏపీఎం జీవీకేడీఎం.లక్ష్మి, హౌసింగ్ ఏఈ వైవీ.వెంకట్రావు,ఎలక్ట్రికల్ ఏఈ అల్లు రామకృష్ణ, ఈవో కె.శ్రీనివాసరెడ్డి, సచివాలయ కార్యదర్శి జడ్డు ఫణీంద్రకుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు ముప్పిడి సంపత్‌కుమార్, చిట్టూరి బాపన్న, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



జగన్నాథపురం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి కొట్టు

గారపాటికి కొట్టు నివాళి

తాడేపల్లిగూడెం అర్బన్ : పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త గారపాటి సత్యనారాయణ మృతికి ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ సంతాపం తెలిపారు. శనివారం గారపాటి కుటుంబ సభ్యులను కలిసి సానుభూతిని వ్యక్తం చేశారు.గారపాటి ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాడ సానుభూతిని తెలిపారు.

బీసీల దీక్షకు తలొగ్గి కేసుల ఉప సంహరణ

తణుకు టౌన్: తణుకు రూరల్ మండలం వేల్పూరులోని బీసీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి సంబంధించి బీసీల నిరసన దీక్షలకు తలొగ్గి తెలుగుదేశం పార్టీ నాయకులు కోర్టులో వేసిన కేసులు ఉపసంహరించుకున్నారని తణుకు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ పరిశీలకుడు జక్కంశెట్టి రాజేంద్రప్రసాద్ చెప్పారు. శనివారం వేల్పూరులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తణుకు నియోజకవర్గంలో మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ప్రజల్లో వస్తున్న మంచి పేరును దెబ్బతీసేందుకు టీడీపీ నాయకులు వేసిన కేసులు బీసీ దీక్షలతో వెనక్కు తీసుకున్నారని చెప్పారు. అత్తిలి మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ బీసీల మధ్య చిచ్చు పెట్టాలనే ఉద్దేశ్యంతో కేసులు వేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు నున్న దుర్గా ప్రసాద్, సొసైటీ అధ్యక్షుడు పెనుమర్తి వెంకట్రామన్న, మండల మహిళా అధ్యక్షురాలు చంద్రు శ్యామల, శెట్టిబలిజ సంఘం నాయకులు గుత్తుల సత్యనారాయణ, అగ్నికుల క్షత్రియ నాయకుడు తిరుమాని నాగేశ్వరరావు, మల్లేశ్వరపు నరసింహమూర్తి, చంద్రు బుల్లివీరయ్య, మహాలక్ష్మీ చెరువు సర్పంచ్ పాలా శ్రీను, ఎంపీటీసీ సభ్యురాలు వెంకట దుర్గ, రెడ్డి సత్యరావు, తాడిపర్తి రాజశేఖర్, కరెళ్ల వరప్రసాద్ పాల్గొన్నారు.

పెంచిన కరెంటు చార్జీలు తగ్గించాలి

తాడేపల్లిగూడెం: పెంచిన కరెంటు చార్జీలు, ట్రూఅప్ చార్జీలు, అదనపు చార్జీలు తగ్గించాలని కోరుతూ జయలక్ష్మి సెంటర్‌లోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద శనివారం సీఐటీయు, గూడ్సుషెడ్ వర్కర్లు నిరసన తెలియచేశారు. ఈ మేరకు ఏఇ. ఏ.వెంకటేశ్వరరావుకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సీఐటియు నాయకులు పాల్గొన్నారు.

మానసిక సమస్యల పై అవగాహన అవసరం

తణుకు అర్బన్: జాతీయ మానసిక ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా జిల్లా మానసిక ఆరోగ్య విభాగం ఆధ్వర్యంలో శనివారం స్థానిక శ్రీవాసవి జ్యోతి మానేపల్లి నారాయణమూర్తి మెమోరియల్ వృద్ధ ఆశ్రమంలో వృద్ధులకు మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సైకాలజిస్ట్ కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ వృద్ధాప్యంలో తలెత్తే మానసిక సమస్యల పట్ల వృద్ధులు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్‌నర్సు స్వర్ణకుమారి, వృద్ధాశ్రమ సిబ్బంది పాల్గొన్నారు.

సంపూర్ణ పోషణతో ఆరోగ్యం

పెంటపాడు: వైఎస్సార్ సంపూర్ణ పోషణతో బావి తరాలకు సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు పెన్నాడ సూరిబాబు, సొసైటీ అధ్యక్షుడు దేవ వెంకటరమణలు పేర్కొన్నారు.శనివారం రావిపాడు పంచాయతీ కార్యాలయం వద్ద గర్భిణులకు వైఎస్సార్ పౌష్టికాహారం కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గర్భిణులకు, బాలింతలకు ఎన్నో పథకాలు ప్రవేశపెట్టారన్నారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ దాకే బుల్లబ్బాయి, వైఎస్సార్ సీపీ నాయకులు పెన్నాడ రాఘవ, పూడి శ్రీనివాస్, అంగన్‌వాడీ టీచర్లు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్‌లో శాంతి నెలకొల్పాలి

పెంటపాడు: మణిపూర్‌లో మూడు నెలలుగా జరుగుతున్న హింసను తక్షణం అరికట్టాలని, దోషులైన వారిపై కేంద్రం కఠినచర్యలు తీసుకోవాలని యునైటెడ్ పాస్టర్ల అసోషియేషన్ డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో యునైటెడ్ పాస్టర్స్ అసోషియేషన్ చైర్మన్ జీజే జ్యోతి ఆనంద్ గౌరీపట్నం చర్చి ఫాథర్ ఎస్. జాన్‌పీటర్, యునైటెడ్ పాస్టర్ల సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వరాల వెంకన్నకు విశేష పూజలు

అత్తిలి: ఈడూరు గ్రామంలో వేంచేసియున్న వరాల వెంకటేశ్వరస్వామికి శనివారం ప్రత్యేక పూజలు జరిపారు. వేకువ జామున స్వామివారికి సుప్రభాతసేవ, తోమాల సేవ నిర్వహించారు. ఉదయం అర్చనలు చేసి, విశేషంగా అలంకరించారు.